క్లుప్తంగా

ఐఓటీపై అవగాహన



ఐసీటీ ప్రతినిధి నగేష్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

కుప్పం రూరల్: ప్రతి ఒక్కరూ ఐఓటీ (ఇంటర్‌నెట్ ఆఫ్ థింక్స్)పై అవగాహన పెంచుకోవాలని ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డా.సునీల్‌రాజ్ అన్నారు. ఐసీటీ, ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఐఓటీపై అధ్యాపకులకు ఏర్పాటు చేసిన మూడు రోజుల శిక్షణా శిబిరాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో ఇంటర్‌నెట్, ఏఐలను వినియోగించుకుని చేపట్టే అద్భుతాలు చూస్తామని చెప్పారు. అందుకనుగుణంగా ప్రతి ఒక్కరూ మార్పులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీటీ ప్రతినిధి నగేష్, ప్రిన్సిపల్ సుధాకర్ బాబు, అధ్యాపకులు, పీఆర్వో ప్రవీణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

జెడ్పీ చైర్మన్ నివాళి



నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: మండలంలోని పాముగానిపల్లె పంచాయతీ పాతూరుకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సతీష్ సతీమణి నిర్మల ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు సోమవారం పాతూరుకు చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా కల్పించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

బియ్యం కార్డులకు దరఖాస్తు చేసుకోండి

రొంపిచెర్ల: అర్హత కలిగిన ప్రతి ఒకరు బియ్యం కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సచివాలయ కార్యదర్శి దశరథ శేఖర్ రెడ్డి సోమవారం తెలిపారు. కొత్త కార్డుల మంజూరుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. రేషన్ కార్డుల్లో పేర్ల తొలగింపు, నమోదు, చిరునామా మార్పులు వంటివి చేసుకోవచ్చని చెప్పారు.

రాగి, వేప వృక్షాల కల్యాణం



కల్యాణోత్సవం చేస్తున్న ఆనందాచార్యులు

చౌడేపల్లె: మండలంలోని చారాల పంచాయతీ జంగాలపల్లెలో గ్రామస్తుల ఆధ్వర్యంలో హిందూ సంప్రదాయరీతిలో రాగి, వేప చెట్లకు కల్యాణోత్సవం సోమవారం వేడుకగా నిర్వహించారు. అర్చకుడు ఆనందాచార్యులచే తొలుత నాగదేవతల రాళ్లకు అర్చనలు, అభిషేక పూజలతోపాటు పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం మంత్రోచ్చారణల నడుమ రాగివేప చెట్టుకు కల్యాణోత్సవాన్ని చేపట్టారు. దీన్ని తిలకించడానికి అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. భక్తులకు నిర్వాహకులచే తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

22న హనుమజ్జయంతి

సదుం: మండలంలోని గొంగివారిపల్లె సమీపంలో ఉన్న సీతమ్మగుట్ట వద్ద ఈనెల 22న అభయాంజనేయస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఉదయం 7 గంటలకు సుప్రభాతం, గణపతి పూజ, 10కి అభిషేకం, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం 7గంటలకు దీపారాధన, అన్నదానం, 9 గంటలకు ద్రౌపదీ వస్త్రాపహరణం నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

పుచ్చలపల్లికి ఘన నివాళి



సుందరయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

పలమనేరు: కమ్యూనిస్ట్ ఉద్యమాలకు మారు పేరు పుచ్చలపల్లి సుందరయ్య అని పట్టణ సీపీఎం కార్యదర్శి గిరిధర్ గుప్త తెలిపారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో సుందరయ్య వర్ధంతిని జరుపుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ కోసం పిల్లలు కూడా వద్దనుకున్న మహనీయుడన్నారు. కులం పేరు తెలియరాదని తన పేరును సుందరయ్యగా మార్చుకున్నారని తెలిపారు. దినసరి కూలీల సమస్యలపై పోరాటాలు చేసి వారిని సంఘటితం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఆయన బాటలో నేటి సమాజం పయనించాలన్నారు. ఇందులో పలువురు సీపీఎం కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

శ్రీసల్లాపురెమ్మకు పూజలు

బైరెడ్డిపల్లె: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో వెలసిన శ్రీ సల్లాపురెమ్మ ఆలయ జాతరలో భాగంగా సోమవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద యాగశాలపూజ, కళాహోమం, జయాధిహోమం చేపట్టారు.

అలరించిన దుర్యోధన వధ



పాండవుల విగ్రహాలకు పూజలు

గుడుపల్లె: మహాభారత మహోత్సవాల్లో భాగంగా యామగానిపల్లె శ్రీద్రౌపదీ ధర్మరాజుల ఆలయం వద్ద సోమవారం నిర్వహించిన దుర్యోధన వధ ఘట్టం అలరించింది. ఆలయ సమీపంలోని గుడి సత్రం వద్ద దుర్యోధనుడి ప్రతిమను ఏర్పాటు చేశారు. పాండవుల విగ్రహాలను ప్రతిష్ఠించగా, దుర్యోధన, భీముడు, ద్రౌపదీ వేషధారులు చేరుకున్నారు. అక్కడ గదా యుద్ధం ఆరంభించారు. దుర్యోధనుడు మృతి చెందడంతో యుద్ధం ముగిసింది. అనంతరం పాండవులు, ద్రౌపది విగ్రహాల ఉత్సవాలను గుడిసత్రం నుంచి ఊరేగించారు. ఈ ఘట్టాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామస్తులు వేలాది మంది తరలివచ్చారు. రాత్రి ద్రౌపది అమ్మవారి ఉత్సవం నినర్వహించారు. అనంతరం ద్రౌపది అమ్మవారికి అగ్ని నిప్పులతో వడిబాల కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ద్రౌపది అమ్మవారి ఉత్సవంలో భాగంగా పచ్చిగరిగను అగ్నిగుండం ప్రవేశం చేశారు. భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు చెల్లించుకున్నారు. నేడు ఆలయంలో శ్రీ ధర్మరాజుల పట్టాభిషేకంతోపాటు పొంగళ్లు నిర్వహించనున్నారు.




దుర్యోధన వధ ఘట్టం తిలకించడానికి తరలివచ్చిన జనసందోహం

రియల్ మాయగాళ్లు..!

వేసవిలోనూ చల్లటి, ప్రశాంత వాతావరణం ఉండడంతో పలమనేరులో స్థిరనివాసం ఉండేందుకు ఇష్టపడేవారే ఎక్కువ. మరోవైపు చెన్నై, బెంగళూరు జాతీయ రహదారిలో పట్టణం ఉండటంతో ఇళ్ల స్థలాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ చదరపు అడుగు రూ.2వేల నుంచి రూ.5 వేల వరకూ పలుకుతోంది. ఇదే అవకాశంగా వివాదాస్పద భూములు, స్థలాలను కొని అమ్మే దళారులూ పుట్టుకొచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా సరే అడిగినంత డబ్బులిస్తే రిజిస్ట్రేషన్ చేయిస్తామంటూ మరి కొందరు ప్రజలకు టోకరా వేస్తున్నారు. ఈ జాదూగాళ్ల బారిన పడి న్యాయం కోసం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికతో పాటు పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదులు వస్తున్నాయి

- డబ్బులిస్తే చాలు ఎలాంటివైనా రిజిస్ట్రేషన్లు
- అన్ రిజిస్టర్డ్ డాక్యుమెంట్లతోనే రూ.లక్షల్లో లావాదేవీలు!
- వివాదంలో ఉన్న భూములే కొందరి టార్గెట్
- స్థలాల క్రయ విక్రయాల్లో తప్పని కుచ్చుటోపీలు



పలమనేరు: ఓ భూమిని, స్థలాన్ని కొనుగోలు చేసేటప్పుడు దాని స్వభావం (క్లాసిఫికేషన్),సెటిల్‌మెంటు పట్టానా? దానిపై ఏదేని అభ్యంతరాలున్నాయా? అసలు రిజిస్ట్రార్ కార్యాలయంలో బ్యాన్ ఉందా? అనే అంశాలను పరిశీలించాలి. ఇందుకోసం 10(1), అండగళ్, రెవెన్యూ ఆన్‌లైన్‌లో ఎవరి పేరిట ఉందో తెలుసుకోవాలి. ఏదైనా సర్వే నంబరుకు సంబంధించి ఈసీ(ఎన్‌కుంబరన్స్ సర్టిఫికెట్), ఆర్‌హెచ్(రిజిస్ట్రేషన్ ఆఫ్ హోల్డింగ్)లను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కనుక్కోవాలి. అన్నీ సక్రమంగా ఉంటే ఆ ప్రాపర్టీని కొనుగోలు చేయవచ్చు. కానీ ఈ విషయాలన్నీ కొనుగోలుదారులందరికీ తెలియదు. దీన్ని అవకాశంగా చేసుకుని కొందరు దళారులు అభ్యంతరాలున్న సర్వే నంబర్లను సైతం అమ్మించడం రియల్ బ్రోకర్లు చేస్తున్నారు. కొంత బయానాగా తీసుకొని స్టాంపుపేపర్‌పై అన్‌రిజిస్టర్ అగ్రిమెంట్లతోనే లక్షల్లో వ్యాపారం చేయిస్తున్నారు. కొనుగోలుదారులు, విక్రయదారులు రిజిస్ట్రేషన్ల కోసం నేరుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్దకెళ్లగానే పదుల సంఖ్యలో దళారులు, ఏజెంట్లు బెల్లం చుట్టూ ఈగలు ముసిరినట్లు కమ్మేస్తున్నారు!

లిటిగేషన్ భూములు..ఫోర్జరీ పత్రాలు

పట్టణంలో ఎక్కడైనా వివాదాల్లో ఉన్న స్థలాలు, భూములను కొనుగోలు చేసే కొన్ని ముఠాలున్నాయి. వీరు ఎంతో కొంత అడ్వాన్సు చెల్లించి ఓ అన్‌రిజిస్టర్ డాక్యుమెంట్ చేయించుకుంటారు. ఆపై స్థలం వద్దకెళ్లి తామే యజమానులమంటూ రంగంలోకి దిగుతారు. నాయకులు, అధికారుల పలుకుబడి ఉపయోగించి సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. అవసరమైతే ఫోర్జరీ పత్రాలను సృష్టిస్తారు. ఒకే స్థలాన్ని యజమాని ద్వారా నలుగురైదుగురికి రిజిస్ట్రేషన్లు చేయించిన సంఘటనలు పట్టణంలో వెలుగు చూస్తూనే ఉన్నాయి. ముఖ్యంగా గ్రామనత్తం పేరిట రెవెన్యూ అధికారులను మేనేజ్ చేసి వాటిని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సులువుగా రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. అధికార పార్టీ నేతల సిఫారసులతో సంబంధిత వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్లు ఈ పనులు చేస్తున్నారని, ఫలితంగా వీరికి సైతం మామూళ్లు అందుతున్నాయనే విమర్శలొస్తున్నాయి.



పట్టణ సమీపంలో ప్రభుత్వ భూములను కలుపుకుని వేసిన లేఔట్

ఇవిగో సాక్ష్యాలు

- ఇటీవల శేఖర్‌బాబు అనే వ్యక్తి తాను కొన్న స్థలం వద్ద నిర్మాణ పనులకు ఉపక్రమించగా మరోవ్యక్తి ఇది తనదంటూ విక్రయపత్రాలు చూపాడు. వీరిద్దరూ అధికారులకు వద్దకెళ్లగా, మరోవ్యక్తి అందరికంటే ముందు తనకు రిజిస్ట్రేషన్ అయ్యిందంటూ తెరమీదికొచ్చాడు. దీంతో వ్యవహారం కోర్టుకు చేరింది.
- పట్టణంలోని ఓ ప్రభుత్వ కళాశాలలో పనిచేసే అధ్యాపకుడి ఇంటిస్థలం విక్రయంలోనూ ఇలాంటి వివాదం తలెత్తింది. దీంతో అతను చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చింది. డబుల్ రిజిస్ట్రేషన్‌పై ఓ న్యాయవాది సైతం ఇబ్బందులు పడ్డారు. పట్టణానికి చెందిన ఇరువురు రియల్ బ్రోకర్లు నిబంధనలు ఏమాత్రం పాటించకుండా తమకు కూటమి మద్దతుతో పట్టణంలో లిటిగేషన్ స్థలాలను కొని ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిసింది. వీరిపై బాధితులు జిల్లా ఎస్పీకి సైతం ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

నాకే ఇబ్బందులు తప్పలేదు



నేను గతంలో పట్టణంలో స్థలం కొన్నాను. అయితే దానిని తాము కొన్నామంటూ కొందరు నన్ను బెదిరించారు. దీనిపై స్థానిక అధికారులు నాకు న్యాయం చేయలేదు. హైకోర్టును ఆశ్రయించడంతో న్యాయం దక్కింది. అయితే ఓ స్థలాన్ని కొనేముందు సంబంధిత సర్వే నంబరు వివరాలు, రిజిస్ట్రార్ కార్యాలయంలో ఈసీ, ఆర్‌హెచ్‌ల తోపాటు రెవెన్యూ కార్యాలయంలో 10(1), అండగళ్, 1-బిలను పరిశీలించి ఆపై కొనాలి.

–సురేష్, న్యాయవాది, పలమనేరు

అభివృద్ధి పనులకు రూ.49 లక్షలు

పుంగనూరు: మున్సిపాలిటి పరిధిలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు పీకేం- ఉడా ద్వారా రూ.49.06 లక్షలు మంజూరైనట్లు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వాదేశాల మేరకు రూ.2.50 కోట్లు మంజూరైందని, ఇందులో తొలి విడతగా రూ.49.06 లక్షలు విడుదలైందన్నారు. ఈ నిధులతో పట్టణంలోని వీధులు, కాలువలు, వీధి దీపాల ఏర్పాటు కోసం ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు పనులు త్వరలోనే చేపట్టనున్నట్లు తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంపై రైతులకు శిక్షణ

పుంగనూరు: స్మార్ట్ ఫోన్లు కలిగిన రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించినట్లు ఏడీ శివకుమార్ తెలిపారు. ఆయన సోమవారం మండలంలోని వనమలదిన్నె ఆర్ఎస్‌కెలో రైతులకు స్కిల్‌ఆఫ్ డిజిటల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఏడీ మాట్లాడుతూ రైతులకు ఫోన్ యాప్ గురించి, అగ్రి సెంట్రల్ యాప్, వ్యవసాయం యాప్, ఎన్‌పీఎస్ఎస్ యాప్, ప్లయిన్‌టిక్స్ యాప్, వాతావరణ సమాచారం, మార్కెట్ సమాచారం, యూట్యూబ్ వినియోగాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజేష్, ఏఈవో శివశంకరప్ప, ఆర్ఎస్‌కే సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షులుగా సోమశేఖర్



పలమనేరు: రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షులుగా పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ ఉగ్రాణం సోమశేఖర్ నియమితులయ్యారు. ఆ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ నుంచి ఆయనకు సోమవారం ఉత్తర్వులు అందినట్టు తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర పదవిని కట్టబెట్టిన కాపునాడు నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కమనీయం.. కోనేటిరాయడి కల్యాణం

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ ప్రసిద్ధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో సోమవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు వేడుకగా నిర్వహించారు. స్వామివారిని శ్రీదేవి భూదేవి సమేతంగా ఆస్థాన మండపం నుంచి ప్రత్యేక కల్యాణ వేదికపై కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అర్చకుల వేద మంత్రాలు, మేళతాళాల నడుమ స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లపై తలంబ్రాలు పోసి, మంగళహారతులు సమర్పించారు. భక్తులు సంప్రదాయ దుస్తుల్లో హాజరై కల్యాణోత్సవాన్ని వీక్షించి తరించారు. ఆ తరువాత స్వామివారు పురవీధుల్లో ఊరేగించగా, భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర, అర్చకులు దేవరాజాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సూపర్‌సిక్స్ హామీలు నెరవేరుస్తాం

పలమనేరు: ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను నెరవేరుస్తామని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం టీడీపీ మినీ మహానాడు ఆయన అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కేవలం మంత్రి పదవికోసమే వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి వెళ్లానని వస్తున్న ఆరోపణలను ఆయన ఖండించారు. తానేనాడు మంత్రి పదవిని ఆశించలేదని చెప్పారు. సూపర్‌సిక్స్ హామీల అమలులో భాగంగా ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు, తల్లికి వందనం పథకాలు అమలు చేస్తామని చెప్పారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని ఆ పార్టీ శ్రేణులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

సదుం: కారు బైక్‌ను ఢీకొని ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు పుంగనూరుకు చెందిన మోహన్‌కుమార్, హేమచంద్ర బైక్‌పై వస్తుండగా, గొంగివారిపల్లె సమీపంలోని ఓ హోటల్ వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వారిద్దరూ గాయపడగా 108 వాహనంలో పీలేరు ఆస్పత్రికి తరలించారు.

జనుము విత్తనాల పంపిణీ

లిచెర్ల(కల్లూరు): మండలానికి 50 క్వింటాళ్ల జనుము, 10 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు వచ్చాయని వ్యవసాయశాఖాధికారి హరిప్రసాద్ తెలిపారు. పొలంలో భూసారం పెంపునకు ఈ జనుము, జీలుగ విత్తనాలు ఉపయోగ పడతాయన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున ఇది సరైన సమయమని చెప్పారు. మండలానికి 1,150 క్వింటాళ్ల వేరుశనగ కదిరి-6 రకం విత్తనాలకు ప్రతిపాదనలు పంపనట్లు వెల్లడించారు. గత ఏడాది 2 వేల ఎకరాలకు ప్రతిపాదనలు పంపితే కేవలం750 ఎకరాలకు విత్తనాలు వచ్చాయని చెప్పారు.

వెంకన్న ఆలయ ఇన్‌స్పెక్టర్‌గా కృష్ణమూర్తి

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ఇన్‌స్పెక్టర్‌గా కృష్ణమూర్తి సోమవారం బాధ్యతలు చేపట్టారు. తిరుపతిలోని విష్ణునివాసం మేనేజర్‌గా ఉన్న కృష్ణమూర్తి బదిలీపై పుంగనూరులో బాధ్యతలు చేపట్టారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి, ఆలయ ఆదాయ వ్యయాలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఆలయంలో టీటీడీ సూచనల మేరకు కైంకర్యాలు నిర్వహిస్తామన్నారు.



పుంగనూరులో బాధ్యతలు చేపట్టిన కృష్ణమూర్తి

హ్యాపీ బర్త్ డే



సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినం సందర్భంగా ఆయన చిత్రం గీసిన యువకుడు తన అభిమానాన్ని చాటుకున్నాడు. మండల పరిధిలోని రాళ్లబూదుగూరు గ్రామానికి చెందిన బి.ఎం.సురేష్ కుమార్ ఎన్టీఆర్‌కు వీరాభిమాని. మే 20 మంగళవారం జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు కావడంతో 300 అడుగుల బొమ్మను ఆకట్టుకునేలా చాక్‌పీసులతో గీశారు. - శాంతిపురం

పటాలమ్మ జాతరకు సర్వం సిద్ధం



ఆలయం వద్ద చలువ పందిళ్లు , విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన కటౌట్

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గంగజాతరకు ముస్తాబైంది. విద్యుత్ దీపాలంకరణలతో వీధులన్నీ కొత్తకాంతులీనుతున్నాయి. భారీ ఏర్పాట్లతో గంగమ్మ దర్శనమిచ్చేందుకు సిద్ధమైంది. మంగళ, బుధవారాల్లో గంగజాతరను అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విద్యుద్దీపాల కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శిరస్సు ఊరేగింపుతో మంగళవారం అర్ధరాత్రి జాతర ప్రారంభం కానుంది. అమ్మవారి విశ్వరూప దర్శనం బుధవారం వైభవంగా నిర్వహించనున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలు ఏర్పాటు చేశారు.

వైభవంగా తిరుపతి గంగమ్మ జాతర

కుప్పం: ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా పట్టణంలో కొనసాగుతోంది. ఈ 15 రోజుల అమ్మవారి జాతరలో చివరి రెండు రోజుల ఉత్సవాలు ప్రధనమైనవి. శిరస్సు ఊరేగింపు, ఆఖరి రోజు అమ్మవారికి జంతు బలులు ఇచ్చి మొక్కులు చెల్లించుకోవడం ఈ జాతర సంప్రదాయం. గంగమ్మ జాతర మహోత్సవానికి ఇరుగు, పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. దీంతో లాడ్జీలు కిక్కిరిసిపోయాయి. ఈ మార్గంలో వెళ్లే ప్రతి రైలును నాలుగు రోజులపాటు కుప్పంలో స్టాపింగ్‌కు రైల్వే శాఖ అనుమతులు ఇచ్చింది. పట్టణం ఇప్పటికే జనసందోహంతో కిక్కిరిసింది.



ముత్తుమారెమ్మకు పూజలు చేస్తున్న భక్తులు



అమ్మవారి అగ్నిగుండ ప్రవేశానికి వెళుతున్న భక్తులు

ఇరువర్గాల వాగ్వివాదం

జాతర సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులకు, అధికార పార్టీ నేతల మధ్య సమన్వయం కొరవడింది. ఆలయ కమిటీ చైర్మన్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, అర్బన్ అధ్యక్షులు రెండు వర్గాలుగా విడిపోయారు. అమ్మవారి జాతరకు భక్తులు ఇచ్చిన విరాళాలు ఆలయ కమిటీ చేరుతాయి. ఈ ఏడాది నూతనంగా అమ్మవారికి పొంగళ్ల నిర్వహణకు 0.30 సెంట్ల స్థలం కేటాయించారు. ఈ విరాళాల సేకరణలో రెండు వర్గాల మధ్య వివాదం రేగింది. దీంతో ఆలయ ప్రాంగణంలోనే నానాదుర్భాషలాడుకున్నారు. అంతేకాకుండా ఎగ్జిబిషన్, లడ్డూ కౌంటర్ వేలంలో కూడా ఇరువర్గాల మధ్య విభేదాలు తలెత్తాయి.

పోలీసులు వర్సెస్ అధికార పార్టీ నేతలు

గంగమ్మ జాతర సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు పోలీసులు, అధికార పార్టీ నేతల మధ్య వాగ్వాదంతో గందరగోళం నెలకొంది. నాలుగు రోజులపాటు బస్టాండు ప్రాంగణంలో మెగా డ్యాన్సు ప్రోగ్రాం నిర్వహణ రాత్రి 11 గంటలకు పూర్తి చేయాలని డీఎస్పీ పార్థసారథి సూచించారు. కానీ 12 వరకు చేపడతామని అధికార పార్టీ నేతలు భీష్మించుకున్నారు. దీంతో జిల్లా నలుమూలల నుంచి పోలీసు బలగాలు బందోబస్తుకు కుప్పం చేరుకున్నాయి.



జాతరలో పాట కచేరి నిర్వహిస్తున్న కళాకారులు

భక్తి శ్రద్ధలతో అగ్నిగుండ ప్రవేశం

జాతర సందర్భంగా సోమవారం రాత్రి ముత్తుమారెమ్మ అగ్నిగుండప్రవేశం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముత్తుమారెమ్మను ఆలయం నుంచి అగ్నిగుండ ప్రాంతం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చి గోవింద నామస్మరణల మధ్య అమ్మవారి పచ్చగెరిగ, ఉత్సవ ప్రతిమను అగ్నిగుండ ప్రవేశం చేయించారు. భక్తులు భారీగా తరలిరావడంతో అగ్నిగుండ ప్రవేశం జనంతో కిక్కిరిసింది. అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన అమ్మవారి పుష్పపల్లకీ నేతాజీరోడ్డు, బైపాస్ మీదుగా సాగింది. అమ్మవారి శిరస్సు ఊరేగింపు మంగళవారం ఉదయం ఆలయ ప్రాంగణం నుంచి చెరువు కట్టపై ఉన్న పెదబావి వద్దకు చేరుకుంటుంది. బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బి.ఎం.కే రవి తెలిపారు.